

### లిస్టులో నా పేరు రాలే

తాంసి, డిసెంబర్ 2 : పంట వేద్దామని రూ.లక్షా 75 వేల అప్పు తీసుకున్న. ఎన్నికలకు ముందు కాంగ్రెసోళ్లు రూ.2 లక్షల లోపు మాఫీ చేస్తమన్నరు. నాలుగో లిస్టులో కూడా నా పేరు రాలే. నేను రైతును కాదా.. పంట కోసం అప్పు తీసుకున్నోళ్లందరికీ మాఫీ చేయాలే. కేసీఆర్ సర్కారుల అందరికీ రుణం మాఫీ చేసిన్రు. వీళ్లు మాత్రం కొందరికే ఇచ్చి చేతులు దులుపుకున్నరు. గీ వయసులో ఆఫీసుల చుట్టూ తిరగడం ఇబ్బందిగా ఉంది. మా బాధలను అర్థం జేసుకొని అప్పు మాఫీ చేయాలె.

**- కంది పొచ్చక్క, హస్నాపూర్**

### సార్ల చుట్టూ తిరిగినం

దహెగాం,డిసెంబర్ 2 : నా పేరుమీద కొంచవెల్లి గ్రామీణ బ్యాంక్‌లో రూ. 60 వేలు, నా భార్య పేరున రూ. 80 వేల పంట రుణం తీసుకున్నం. సర్కారు రుణ మాఫీ చేస్తదని ఆశతో ఎదురు చూసినం. యేటా బ్యాంక్ రుణాలు మంచిగ కడుతున్నం. మా ఊరిలో కొందరి రైతులకు మాత్రమే డబ్బులు పడ్డయి. మాకు ఎందుకు రాలేదని బ్యాంక్ సార్లను అడిగితే అగ్రికల్చర్ సార్లను అడుగమని చెప్పిన్రు. గా సార్ల చుట్టూ మస్తు తిరిగినం. రానివాళ్ల లిస్టు పైకి పంపిస్తున్నం. వస్తదని చెప్పిన్రు. కానీ ఇప్పటి వరకు రూపాయి కూడా రాలే.

**-కూడె బక్కన్న, గిరివెల్లి**



### మాట ఇచ్చి తప్పిండు

తాంసి, డిసెంబర్ 2 : హస్నాపూర్ శివారులో 8 ఎకరాల్లో వ్యవసాయం చేస్తున్న. మూడో విడుత రుణమాఫీలో నా పేరు వస్తుందని ఆశపడ్డా. నాలుగో విడుత వచ్చినా నా పేరే లేదు. సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికలకు ముందు రైతులందరికీ రుణమాఫీ చేస్తానని చెప్పిండు. ఇప్పుడు మాట తప్పిండు. రూ.లక్షా 75 వేలు బాకీ ఉన్న. ఇప్పటిదాకా ఒక్క రూపాయి రుణమాఫీ కాలేదు.

**-కంది సుభాష్ రెడ్డి, హస్నాపూర్**





# రుణమాఫీ కాలే..

## మాఫీ చేసినట్లు గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ సర్కారు

- ఎంత మందికి మాఫీ అయ్యింది.. ఎందరికీ కాలేదు అనేదానిపై క్లారిటీ మిస్..
- సర్వే చేసిన వివరాలు ఆన్‌లైన్ చేసినా వాళ్లకూ రుణమాఫీ అవ్వలేదు..
- మా దగ్గర లెక్కలు లేవంటున్న ప్రభుత్వ యంత్రాంగం

మంచిర్యాల, డిసెంబర్ 2(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : అసెంబ్లీ ఎన్నికలకు ముందు రూ.2 లక్షల లోపు రైతుల రుణాలు మాఫీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చాక మాట మార్చింది. వాయిదాలు వేస్తూ అధికారంలోకి వచ్చి ఏడాదైనా పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయడంలో విఫలమైంది. రాష్ట్రంలోని రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ కోసం రూ.40 వేల కోట్లు అవుతాయని రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారానికి ముందు ప్రకటించారు. అధికారంలోకి వచ్చాక రూ.31 వేల కోట్లతో కేబినేట్ తీర్మానించింది. ఇక్కడే రూ.9 వేల కోట్లు తగ్గిందనుకుంటే.. రాష్ట్ర బడ్జెట్‌లో రుణమాఫీకి కేవలం రూ.26 వేల కోట్లు పెట్టారు. చివరకు నాలుగు విడుతల్లో కలిపి రూ.20,616 కోట్లు మాఫీ చేశామంటున్నారు. సీఎం చెప్పిన దానిలో సగానికి సగం రుణమాఫీ మొత్తం తగ్గింది. ఈ లెక్కన సగం మందికి కోత పెట్టారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బ్యాంకర్ల తప్పిదాలతో మాఫీ అంచనా రూ.11 వేల కోట్లు పెరిగితే, మరి బడ్జెట్ కేటాయింపుల్లో ఎందుకు ఎక్కువ చూపించారని రైతులు ప్రశ్నిస్తున్నారు. రూ.2 లక్షల కంటే ఎక్కువ రుణం తీసుకున్నోళ్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. నాలుగో విడుత కింద మంచిర్యాల జిల్లా 8,195 మందికి రూ.78.59 కోట్లు, ఆదిలాబాద్ జిల్లాలో 6,600 మంది రైతులకు రూ.78 కోట్లు, నిర్మల్ జిల్లాలో 6,823 మంది రైతులకు రూ.69.67 కోట్లు, ఆసిఫాబాద్ జిల్లాలో .... రైతులకు ... కోట్లు విడుదల చేసినట్లు గణాంకాలు చెప్తున్నాయి.

### కేసీఆర్ సర్కారు చేసినప్పుడే బాగుండే..

తెలంగాణలో తొలిసారి కేసీఆర్ సర్కారు 35 లక్షల మంది రైతులకు రూ.లక్ష వరకు రూ.17 వేల కోట్ల రుణమాఫీ చేసింది. ఇప్పుడు 25.35 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల వరకు చేసినా కేవలం రూ.20 వేల కోట్లు అయ్యిందంటున్నారు. ఈ లెక్కన సగానికి సగం మందికి రుణమాఫీ కాకుండా ఎగ్గొట్టినట్లు స్పష్టం అవుతున్నది. రుణమాఫీ కానీ రైతుల్లో ఇప్పటికే కాంగ్రెస్ సర్కారుపై నైరాశ్యం నెలకున్నది. రుణమాఫీ కాలేదని బయటికి వచ్చి చెప్పుకోలేని దుస్థితిలో అన్నదాతలు ఉన్నారు. బ్యాంకులకు వెళ్లి స్టేట్‌మెంట్ తీస్తేకాని రుణమాఫీ వివరాలు తెలిసేలా లేవు. ఈ నేపథ్యంలో మరో ఒకటి, రెండు రోజుల్లో పూర్తిస్థాయి వివరాలు బయటికి రానున్నాయి. అన్ని అర్హతలు ఉండి రుణమాఫీ కాని కొందరు రైతులు ప్రభుత్వంపై మండిపడుతున్నారు. మాకెందుకు అన్యాయం చేయారంటూ నిలదీస్తున్నారు.

### సర్వే చేసినా ప్రయోజనం శూన్యం

మూడు విడుతల్లో రేషన్‌కార్డు లేనోళ్లు, పేర్లలో అక్షర దోషాలు ఉన్నోళ్లకు రుణమాఫీ కాలేదు. ఈ మేరకు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించి అధికారులు సర్వే చేశారు. ఆ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. అయినప్పటికీ వారిలో చాలా మందికి రుణమాఫీ కాలేదు. రూ.2 లక్షల కంటే ఎక్కువ రుణం ఉన్న రైతులు బ్యాంక్‌లకు వెళ్లి ఎక్కువ మొత్తాన్ని చెల్లించాలని, అనంతరం రూ.2 లక్షల మాఫీ అవుతుందంటూ గతంలో చెప్పారు. రైతులు కూడా బ్యాంకులకు వెళ్లి బారులుదీరి రుణాలు చెల్లించారు. రుణం చెల్లించిన పత్రాలను తీసుకుని రైతు వేదికల్లో అధికారులకు సమర్పించారు. ఇక నాలుగో విడుతలో మాకు రుణమాఫీ అవుతుందనుకుని సంబురపడ్డారు. కానీ.. అసలు వారెవరికీ మాఫీ జరగలేదని తెలిసింది. రేషన్‌కార్డు లేనోళ్లు, పేర్లలో అక్షర దోషాలు ఉండి రానోళ్లు.. రూ.2 లక్షల కంటే ఎక్కువ రుణం ఉన్నోళ్లు చాలా మంది రూ.2 లక్షలు మాఫీ కాక లబోదిబో మంటున్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు, పింఛన్‌దారులకు, ఐటీ రిటర్న్స్ కట్టేవాళ్లకు, రేషన్‌కార్డ్ లేని వారికి.. ఇలా అనేక రకాల కొర్రీలు పెట్టి 100 మందిలో 60 మందికే మాఫీ చేసి 40 మందికి ఎగ్గొట్టింది. ఎన్నికల్లో ఓట్లేసి గెలిపించిన రైతులను కాంగ్రెస్ సర్కారు మోసం చేసింది. ఉమ్మడి జిల్లాలో దాదాపు 2.50 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేసినట్లు అధికారులు చెప్తున్నా ఎందరికి అయ్యింది. ఎందరికి కాలేదంటే మాత్రం వివరాలు లేవని చెప్తున్నారు.



### మా ఇంట్లో ఏ ఒక్కరికీ మాఫీ కాలే

చింతలమానేపల్లి, డిసెంబర్ 2 : మా కుటుంబంలో ముగ్గురం కలిసి సిర్పూర్ (టీ) మండల కేంద్రంలోని సొసైటీ బ్యాంక్‌లో లోన్ తీసుకున్నం. ఇప్పటి వరకు ఏ ఒక్కరికీ మాఫీ కాలే. మా అమ్మ దేవబాయి రూ. లక్షా 20 వేలు, నాన్న వసంత్‌రావు రూ. 18 వేలు, నేను రూ. 40 వేల క్రాప్ లోన్ తీసుకున్న. 2 లక్షలు తీసుకున్న ప్రతీ ఒక్కరికీ రుణం మాఫీ చేశామని చెబుతున్నరు. కానీ మాకు కాలేదు. ఇది అన్యాయం. మా ఊరిలో అనేక మంది రైతులకు రుణమాఫీ కాలే.

**- నికోడె సందీప్, డబ్బా**



### రూ. 2 లక్షలు దాటిందని..

బెజ్జూర్, డిసెంబర్ 2 : నా పేరు మీద రెండెకరాల భూమి ఉన్నది. నా పెనిమిటి పేరు మీద నాలుగెకరాల భూమి ఉంది. ఇద్దరం కలిసి రూ. 2,16,000 రుణం తీసుకున్నం. రూ. 2 లక్షలు దాటినందుకే రుణమాఫీ కాలేదని బ్యాంకు మేనేజర్ చెప్పిండు. గిదెక్కడి న్యాయం. మాకు కూడా రుణమాఫీ చేయాలే. ఎలక్షన్లప్పుడు మాట ఇచ్చి.. గిప్పుడు గిట్లా తప్పుడేందో మరి.

**- జుండె జమునాబాయి, కుకుడ**



### ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

కోటపల్లి, డిసెంబర్ 2 : నాకు మా ఊరిలో ఎనిమిదెకరాల భూమి ఉంది. నా పేరు మీద రూ. లక్షా 30 వేలు, నా భార్య పేరు మీద రూ. లక్షా 90 వేల రుణం తీసుకున్న. మొత్తం రూ. 2 లక్షల 90 వేల రుణం ఉంది. రూ. 2 లక్షలు మాఫీ చేసినా మిగతా డబ్బులు కట్టుకునేటోళ్లం. ఇప్పుడు రుపాయి కూడా మాఫీకాకపాయె. నాలుగు విడుతలు ఎదురు చూసినా లాభం లేకుంటైంది. అధికారంలోకి రాకముందు రైతులకు ఇచ్చిన మాట ప్రకారం ప్రతి రైతుకూ రుణం మాఫీ చేయాలి.

**- కొట్టె సంతోష్, కోటపల్లి**



### అన్యాయం చేసిన్రు

కోటపల్లి, డిసెంబర్ 2 : నాకు మా ఊరిలో ఆరెకరాల భూమి ఉంది. బ్యాంకులో రూ. 2 లక్షల పంట రుణం తీసుకున్న. ఇగ మాఫీ అయితదో.. అగ మాఫీ అయితదోనని నాలుగు విడుతల నుంచి ఎదురు చూస్తున్న. కానీ ఇంత వరకు ఏ లిస్టులో కూడా నా పేరు రాలే. రూపాయి కూడా మాఫీ చేయలే. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాత్రం అందరికీ రుణమాఫీ చేసినమని ప్రకటించిండు. నాలాగే మస్తుమందికి అన్యాయం జరిగింది. ఎన్నికలప్పుడు అందరికీ రుణమాఫీ చేస్తమని మాటిచ్చి.. ఇప్పుడు తప్పిన్రు. ఎన్నో ఆశలు పెట్టుకున్నం. గిట్లా చేస్తడనుకోలే.

**- పదాల శంకర్, కోటపల్లి**




రెబ్బెన గురుకుల పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న బీఆర్ఎస్, బీఆర్ఎస్వీ నాయకులు

## రెబ్బెన గురుకులం ఎదుట ధర్నా

రెబ్బెన, డిసెంబర్ 2 : రాష్ట్ర సర్కారు గురుకుల విద్యను తీవ్ర సంక్షోభంలోకి నెట్టిందని బీఆర్ఎస్వీ ఆసిఫాబాద్ జిల్లా ఇన్‌చార్జి ముస్తఫా పేర్కొన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆదేశాల మేరకు సోమవారం సాయంత్రం బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో రెబ్బెన మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల సందర్శనకు వెళ్లగా, రెబ్బెన సీఐ బుద్దే స్వామి, ఎస్ఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు అడ్డుకున్నారు. లోనికి వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలంటూ నాయకులు ధర్నాకు దిగారు. ఆయన మాట్లాడుతూ సర్కారు మొద్దునిద్ర వీడి విద్యార్థులకు నాణ్యమైన ఆహారం పెట్టి, సకల సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కార్నాథం సంజీవ్‌కుమార్, వైస్ చైర్మన్ రంగు మహేశ్‌గౌడ్, బీఆర్ఎస్ జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి కుందారపు శంకరమ్మ, బీఆర్ఎస్ మహిళా మండలాధ్యక్షురాలు అన్నపూర్ణ అరుణ, మాజీ ఎంపీపీ జుమ్మిడి సౌందర్య, మాజీ ఎంపీటీసీ సంగం శ్రీనివాస్, మాజీ సర్పంచ్ బొమ్మినేని అహల్యాదేవి, మాజీ కో ఆప్షన్‌మెంబర్ జౌరొద్దీన్, మాజీ ఉప సర్పంచ్ బొమ్మినేని శ్రీధర్, నాయకులు పల్లె రాజేశ్వర్‌రావు, వినోద్‌జైస్వాల్, తక్కలపల్లి రాజేశ్వర్‌రావు, దుర్గరావు, పర్వతి అశోక్, దుర్గం భరద్వాజ్, మన్యం పద్మ, తిరుపతి, రాజేశ్, రాపర్తి అశోక్, శంకర్, సీతారం, విలాస్ ఉన్నారు.

## గిరిజన ఆశ్రమాన్ని సందర్శించిన బీఆర్ఎస్వీ

బెల్లంపల్లి, డిసెంబర్ 2 : పట్టణంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను సోమవారం రాత్రి బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు బడికల శ్రావణ్ ఆధ్వర్యంలో నాయకులు సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా అని ఆరా తీశారు. వంటశాలను పరిశీలించారు. ఇక్కడి సమస్యలను బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు నివేదిక రూపంలో అందిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు చైతన్య, పట్టణ అధ్యక్షుడు అరుణ్, నాయకులు రోషన్, అఖిల్ పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్వీ నాయకులు

## గురుకులాల బాటపై భయమెందుకు?

- వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే అడ్డంకులు ● సర్కారుపై బీఆర్ఎస్వీ నాయకుల ఫైర్
- చెన్నూర్ పట్టణంలోని మైనార్టీ గురుకుల పాఠశాల సందర్శన ● పోలీసులు, సిబ్బంది అడ్డుకోవడంతో నిరసన

చెన్నూర్, డిసెంబర్ 2: బీఆర్ఎస్ చేపడుతున్న గురుకులాల బాటపై సర్కారుకు భయమెందుకని బీఆర్ఎస్వీ నాయకులు ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ ఆదేశాల మేరకు సోమవారం చెన్నూర్ పట్టణంలోని మైనార్టీ గురుకుల పాఠశాల సందర్శనకు వెళ్లిన బీఆర్ఎస్వీ నాయకులను పోలీసులు, గురుకుల పాఠశాల సిబ్బంది అడ్డుకోవడంపై మండిపడ్డారు. మైనార్టీ గురుకుల పాఠశాల ముందు ఆందోళనకు దిగి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ పట్టణ అధ్యక్షుడు నాయబ్ మాట్లాడుతూ వసతి గృహాల్లోని వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే పోలీసులు అడుగడుగునా తమను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కొప్పుల రవీందర్, నాయిని సతీశ్, పాశం ఆశీశ్, చినాల ప్రశాంత్‌రెడ్డి, కమటం మనోహర్, దుర్గం తిరుపతి, తిరుపతి సురేశ్, గడ్డం విష్ణు, సంతోశ్, మహేందర్ , తదితరులు పాల్గొన్నారు.



గురుకుల పాఠశాల సందర్శనకు వెళ్లిన బీఆర్ఎస్వీ నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు



ఎమ్మెల్సీ కవితను కలిసిన మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

## ఎమ్మెల్సీ కవితను కలిసిన మాజీ ఎమ్మెల్యే

బెల్లంపల్లి, డిసెంబర్ 2 : నిజామాబాద్ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి, టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య కలిశారు. సోమవారం హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గంలోని పలు అంశాలపై చర్చించారు.



కస్తూర్బా పాఠశాల ఎదుట నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

## కాంగ్రెస్ పాలనలో విద్యావ్యవస్థ అస్తవ్యస్తం

- బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారిశెట్టి విద్యాసాగర్
- భీమారం కస్తూర్బా పాఠశాల సందర్శన ● పోలీసులు అడ్డుకోవడంతో బైఠాయింపు

భీమారం, డిసెంబర్ 2 : కాంగ్రెస్ పాలనలో విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారిశెట్టి విద్యాసాగర్ ఆరోపించారు. సోమవారం స్థానిక కస్తూర్బా పాఠశాలను సందర్శించేందుకు నాయకులతో కలిసి వెళ్లగా, పోలీసులు అడ్డుకున్నారు. ఎంతకూ లోపలికి అనుమతించకపోవడంతో అక్కడే బైఠాయించారు. సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వారు మాట్లాడుతూ విద్యాలయాల్లో సరైన సౌకర్యాలు లేకపోవడం వల్లే సర్కారు గురుకులాల బాటను అడ్డుకుంటుందని మండిపడ్డారు. నాణ్యతలేని ఆహారం వల్లే విద్యార్థులు తరచూ అస్వస్థతకు గురికావాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గురుకుల బాట ఇన్‌చార్జి చెన్నమల్ల చైతన్య, బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు బడిగెల శ్రావణ్, నాయకులు వేముల శ్రీకాంత్ గౌడ్, వేముల ప్రణీత్‌గౌడ్, భూక్య రాజేశ్‌నాయక్, అనిల్, నూతన్ పాల్గొన్నారు.

## విద్యార్థుల సంక్షేమం పట్టదా?

- బీఆర్ఎస్ నియోజకవర్గ కన్వీనర్ లెండుగురే శ్యాంరావు, బీఆర్ఎస్వీ జిల్లా ఇన్‌చార్జి ముస్తఫా
- శ్రేణులతో కలిసి జ్యోతిబా పూలే పాఠశాలల సందర్శన ● పోలీసుల అడ్డుకోవడంపై ఆగ్రహం.. నిరసన

కాగజ్‌నగర్, డిసెంబర్ 2 : రాష్ట్ర ప్రభుత్వం గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల విద్యార్థుల సంక్షేమంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని బీఆర్ఎస్ నియోజకవర్గం కన్వీనర్ లెండుగురే శ్యాంరావు, బీఆర్ఎస్వీ జిల్లా ఇన్‌చార్జి ముస్తాఫా ఆరోపించారు. సోమవారం కాగజ్‌నగర్ పట్టణంలోని జ్యోతి బాపూలే, గన్నారంలోని జ్యోతిబా పూలే సందర్శించారు. ఆపై సిర్పూర్ (టీ) మండల కేంద్రంలోని గురుకుల విద్యాలయానికి వెళ్లగా, పోలీసులు అడ్డుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గేటు ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు తెలుసుకోవడానికి వెళ్తే పోలీసులు అడ్డుకోవడం సరికాదన్నారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సౌకర్యాలు కల్పించాల్సిన ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, సర్కారు వైఫల్యం వల్లే ఇటీవల వాంకిడి ఆశ్రమ పాఠశాల విద్యార్థిని శైలజ మృతి చెందిందన్నారు. బీఆర్ఎస్ నాయకులు మోయిన్ అలీ, నక్క మనోహర్, తదితరులు పాల్గొన్నారు.



సిర్పూర్(టీ) గురుకుల విద్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు